క్లుప్తంగా

నేడు సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సిరిగి నారాయణరెడ్డి (సినారె) వర్ధంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. సినారె రాసిన సినీ పాటలు, పద్యాల ఆలాపన, గజల్స్ కార్యక్రమం ఉంటుందన్నారు. గాయకులు టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సుధారాణి, హబీబ్, శీను, బాల వెంకటేశ్వర్లు సంగీత విభావరి పాటలు పాడుతారని పేర్కొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు వినికిడి పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులకు శనివారం ప్రత్యేకంగా వినికిడి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక అబ్బాసనగర్‌లోని కర్నూలు పెన్షనర్ల సంఘం కార్యాలయంలో క్లినికల్ ఆడియోలజిస్టులు విశ్రాంత ఉద్యోగులకు వినికిడి పరీక్షలు నిర్వహిం వినికిడి లోపం ఉన్న పలువురికి మిషన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్యానికి సంఘం పెద్దపీట వేస్తుందన్నారు.

చేగువేరా ఆశయ సాధన కోసం పనిచేయాలి


చేగువేరా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): యువతీ, యువకులు చేగువేరా ఆశయ సాధన కోసం పనిచేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం చేగువేరా జయంతిని సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే కార్మిక, కర్షక భవన్‌లో డీవైఎఫ్ ఆధ్వర్యంలో చేగువేరా జయంతిని నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అన్న ప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శనివారం కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన జె.నిరంజన రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు రవికుమార్‌కు అందజేశారు. దాతకు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశి సత్కరించారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్: హౌటు ట్రైన్ యువర్ డ్రాగన్, హౌస్‌ఫుల్ 5, ఫ్రం ది వరల్డ్ ఆఫ్ జాన్ విక్: బల్లెరినా, అందాల రాక్షసి (2012), తొలిప్రేమ (1998),భగ్ లైఫ్,దిహంటర్: చాప్టర్ 1

వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : అందాల రాక్షసి (2012) , హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్ ,ది హంటర్ : చాప్టర్ 1, భైరవం, కట్టప్ప జడ్జిమెంట్, తొలిప్రేమ (1998),భగ్ లైఫ్

వెంకటేష్ సినీ కాంప్లెక్స్: పాపా, దేవర – పార్ట్ 1

శ్రీరామ : కట్టప్ప జడ్జిమెంట్

రాజ్ : శుభం

భరత్ కాంప్లెక్స్ : వెంకీ (2004)

వైభవంగా పాణి హటి చీడా దహి మహోత్సవం


ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్


జగన్నాథ గట్టులో వెలిసిన జగన్నాథ్


హారతి ఇస్తున్న రూపేశ్వర చైతన్య ప్రభూజీ


కోనేరులో గౌర నితాయిలకు అభిషేకం చేస్తున్న దృశ్యం


ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఇస్కాన్ ఆధ్వర్యంలో వైభవంగా పాణి హటి చీడా దహి మహోత్సవాన్ని నిర్వహించారు. శనివారం నగర శివారులోని పాత జగన్నాథ గట్టులోని శ్రీ జగన్నాథ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన, గౌర నితాయిలకు అభిషేకం నిర్వహించారు. తిరుపతి ఇస్కాన్ ఉపాధ్యక్షులు రూపేశ్వర చైతన్య ప్రభూజీ ప్రవచనం చెప్పారు. సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించాలన్నారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఇస్కాన్ ప్రచారకులు వైష్ణోకృప చైతన్య ప్రభు, కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవ ప్రభు, ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. – కర్నూలు కల్చరల్

‘యోగాంధ్ర’కు ఉద్యోగుల డుమ్మా

● 437 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

కర్నూలు (టౌన్): యోగాంధ్ర కార్యక్రమానికి డుమ్మా కొట్టిన నగరపాలక సంస్థకు చెందిన పలువురు ఉద్యోగులకు కమిషనర్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 12వ తేదీన కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి నగరపాలక సంస్థ ఉద్యోగులు, సచివాలయాల ఉద్యోగులు హాజరు కావాలని కమిషనర్ సర్క్యులర్ పంపించారు. అయితే ఏకంగా 437 మంది ఉద్యోగులు గైర్హాజరయ్యారు. దీంతో కమిషనర్ సీరియస్ అయ్యారు. తాను పంపించిన ఆదేశాలు దిక్కరించారంటూ వీరందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కార్పొరేషన్ అధికారులు ఉద్యోగులు 62 మంది సచివాలయాల అడ్మిన్లు 54, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు 41, వార్డు వెల్ఫేర్ కార్యదర్శులు 43, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు 31, వార్డు శానిటేషన్ ఎన్విరాన్ మెంటల్ కార్యదర్శులు 02, వార్డు రెవెన్యూ కార్యదర్శులు 93. 111 మంది మహిళా కార్యదర్శులకు ఈ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల వ్యవధిలో గైర్హాజరుకు సరైన కారణాలు తెలియజేయాలని లేదంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

మనస్సు, శరీరం కలయికే యోగా

కర్నూలు(హాస్పిటల్): యోగా అనేది సంస్కృత పదం నుంచి వచ్చిన మనస్సు, శరీరం కలయిక అని, యోగాసనాలు చేయడం ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం కలుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా శనివారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. యోగా చేయడంతో మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతుందని తెలిపారు. ఈ నెల 21వ తేదిన యోగా దినోత్సవం రోజున సమీపంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ప్రజలచే యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ఉమా, డెమో శ్రీనివాసులు శెట్టి, గ్రామ సర్పంచ్ సుశీలమ్మ, పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి, వీఆర్‌వోలు సరస్వతి, మద్దిలేటి, హెచ్‌ఎం విజయమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు కొత్త జీతాలు ఇప్పించాలి


ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కాంట్రాక్టు చేజిక్కించుకున్న ఈగల్ హంటర్ సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ నుంచి అగ్రిమెంట్‌లో చూపిన విధంగా సెక్యూరిటీ గార్డులకు కొత్తగా జీతాలు ఇవ్వాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. ఈ మేరకు శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వేతనాలు ఇప్పించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, వారాంతపు సెలవులు, ఆర్జిత సెలవులు, జాతీయ పండుగ సెలవులు, మహిళలకు మెటర్నిటీ సెలవులు అమలు చేయాలని కోరారు. గతంలో ఉన్న ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ నుంచి బకాయిపడిన మూడు నెలల జీతాలు, పీఎఫ్ డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, సెక్యూరిటీ గార్డు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, ప్రణీత్, పరమేష్ ఉన్నారు.

ఒలింపిక్ లోగో ఆవిష్కరణ

కర్నూలు (టౌన్): ఒలింపిక్ డే వేడుకల సందర్భంగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో శనివారం ఒలింపిక్ లోగోను కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీధర్ రెడ్డి, డాక్టర్ తిరుపాల్ రెడ్డి, ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘానికి అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు


అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా నియమితులైనట్లుగా ఉత్తర్వు కాపీలు ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్):ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖకు అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, కే.చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు. అడ్‌హాక్ కమిటీలో జి.అబ్దుల్‌హమీద్ (ఆర్‌డబ్ల్యూఎస్ కర్నూలు డివిజన్), ఎం.నమేనాయక్ (ఎన్‌సీసీ కమాండెంట్), ఇలియాస్ బాషా (జిల్లా వ్యవసాయ అధికారి), పి.విజయకుమార్ (ఆర్‌డబ్ల్యూఎస్‌అండ్ ఎస్, జెడ్పీ), ఎన్.షబ్బీర్‌బాషా (సమాచార శాఖ) సభ్యులుగా ఉన్నారు. ఇప్పటి వరకు ఉన్న కార్యవర్గం బైలాను పాటించడం లేదని రాష్ట్ర సంఘం గుర్తించి రాష్ట్ర సంఘం నేతలు అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసింది. శనివారం అడ్‌హాక్ కమిటీ సభ్యులు నియామక ఉత్తర్వులను ప్రదర్శించారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులైన అబ్దుల్ హమీద్ గతంలో జిల్లా సంఘానికి అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర సంఘంలో కూడా కొనసాగుతున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): వచ్చే నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. జిల్లాలో జరిగే ఆందోళనల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు కార్మికులపై నిరంకుశ వైఖరిని అవలంభిస్తున్నాయని విమర్శించారు. 1986లో అమెరికాలోని చికాగో సమావేశంలో సాధించుకున్న 8 గంటల పని విధానానికి స్వస్తి చెప్పడం అన్యాయమన్నారు. పది గంటల పని విధానంతో రాత్రిళ్లు కూడా మహిళలు ఉద్యోగాలు చేయాలా అని ప్రశ్నించారు. కార్మికులు ప్రాణ త్యాగంచేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యాయమని, వాటి స్థానంలో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్‌సాయిబాబ, నారాయణస్వామి, కె.ప్రభాకర్, విజయ్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యం చేస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద శనివారం హైదరాబాద్‌కు చెందిన అర్చన బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణేశ పంచరత్నం, శివపంచాక్షరి, శివాష్టకం, శివతాండం, శివశివ శంకర, శివస్తుతి, దేవీస్తుతి, తదితర అష్టకాలకు, గీతాలకు అర్చన, మానస, ప్రణవి, ప్రవల్లిక, మహాలక్ష్మి, చరిత, చందన నృత్యం ప్రదర్శించారు.

శ్రీ హట్టి మునిస్వామి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: అనంత సుబ్రహ్మణ్యం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అనంత అనిల్ కుమార్ రచించిన ‘శ్రీ హట్టి మునిస్వామి జీవిత చరిత్ర’ పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో జరిగిన కార్యక్రమంలో లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం, విశ్రాంత ప్రిన్సిపాల్ కె.చెన్నయ్య, తరిగొండ వెంగమాంబ సేవా ట్రస్ట్ అధ్యక్షులు పసుపులేటి నీలిమ తదితరులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. లలితా పీఠం, సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

● కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌లో ఎంపికైన ఏడు గ్రామాల్లో 17 శాఖల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఎంపికై న మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి, నెరణికి, హొళగుంద మండలంలోని హొళగుంద, కోగిలతోట, మద్దికెర మండలంలోని పెరవలి, మద్దికెర, హంప గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద పథకాలు పొందుతున్న లబ్ధిదారుల సంతృప్త స్థాయిని తెలుసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని గిరిజనులకు పక్కాగృహాలు, రోడ్లు, జల జీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరా, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, యుష్మాన్ భారత్ కార్డులు, కులం సర్టిఫికెట్లు, పెన్షన్లు, గ్యాస్, కిసాన్ క్రెడిట్ కార్డులు, ముద్ర రుణాలు, పీఎం విశ్వకర్మ యోజన దితర పథకాలు అందేలా చూడాలని కోరారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా గిరిజన సంక్షేమాధికారి తులసీదేవి, ఆయా మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

కమీషన్ ఏజెంట్ల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు కమీషన్ మండి మర్చెంట్స్ (కమీషన్ ఏజెంట్లు) అసోషియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. శనివారం మార్కెట్ యార్డ్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా శ్రీధర్‌రెడ్డి, అధ్యక్షుడుగా ఎం.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జూటూరు భాస్కర్, ఇల్లూరు వెంకటేష్, కేశవరెడ్డి, రామచంద్రుడు, కార్యదర్శిగా కట్టా చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలుగా గోపినాథ్‌రెడ్డి, పల్లె అయ్యస్వామి, మహేష్ సీకే, మురళీ, భీమయ్య, కోశాధికారిగా రమణ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. కమీషన్ ఏజెంట్లకు ఏ సమస్య వచ్చినా అసోసియేషన్ అండగా నిలుస్తుందన్నారు.

ఇంజనీరింగ్ సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి

● కేడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్‌పర్సన్ విజయమనోహరి


మాట్లాడుతున్న విజయమనోహరి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేసే ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ కేడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ విజయ మనోహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని నెలరోజులకు పైగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు శనివారం ఆమె సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది సమ్మె చేయడంతో వాటర్ వర్క్స్, పార్కులు, వీధిలైట్ల సమస్యతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలీచాలనీ వేతనాలతో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. తాత్కాలిక సిబ్బందికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంజనీరింగ్ సిబ్బందికి వర్తింపజేయాలన్నారు. అలాగే ఇతర సిబ్బందికి అందుతున్న 69 రోజుల సెలవులను మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందన్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది సమ్మెకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ మునెమ్మ, పార్టీ నాయకులు మల్లికార్జున, బాబు, నాగరాజు, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, యాసిన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ కూటమి అన్యాయం

● వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్



కర్నూలు (టౌన్): తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కేవలం రూ.13 వేలు మాత్రమే ఇచ్చి విద్యార్థుల తల్లులను వంచించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితర కూటమి పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంలో.. నీకు రూ. 15 వేలు.. నీకు రూ. 15 వేలు అంటూ ఊరూ.. వాడా ఊదర గొట్టారన్నారు. ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి రూ. 15 వేలు ఇస్తామన్నారు. చివరకు రూ. 2 వేలు కోత వేయడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. తల్లులను మోసం చేసిన సీఎం చంద్రబాబు క్షమాపణలు చెప్పాలన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటేందుకు ఒలింపిక్ డే రన్


ఒలంపిక్ రన్ లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు (టౌన్): ప్రపంచ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 23వ తేదీన కర్నూలు నగరంలో ఒలంపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు ఒలింపిక్ సంఘం చైర్మన్ కేఈ. ప్రభాకర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న కేఈ ప్లాజాలో శనివారం ఒలింపిక్ రన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఒలింపిక్ డే రన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, క్రీడాకారులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్, కార్యదర్శి జి. శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు షరీఫ్ అహమ్మద్, క్రీడా సంఘాల ప్రతినిధులు రుద్రా రెడ్డి, అవినాష్ శెట్టి, తైక్వాండో సతీష్ కుమార్, కబడ్డీ సుధాకర్ పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన పెంచాలి


రక్తదాతను సన్మానిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని వైద్యులు, సిబ్బందిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు కోరారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆసుపత్రి ఆవరణ నుంచి రాజవిహార్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తదానంలో కీలక పాత్ర పోషించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాతలను ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో జ్ఞాపికలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడాలని కోరారు. రక్తదానం చేస్తే ఎంతో మందికి ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మంది రక్తంలేక చనిపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ విధిగా తమ రక్తాన్ని బ్లడ్ బ్యాంకులో దానం చేయాలన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో రాణించాలి


ఈత పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): ఒలింపిక్ క్రీడ స్విమ్మింగ్‌లో రాణించాలని జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి. శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ డేను పురస్కరించుకొని శనివారం 9 ఏళ్ల నుంచి 17 ఏళ్ల వయస్సు కలిగిన బాల బాలికలు,17 సంవత్సరాలు పైబడిన బాలురకు స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే చదవుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. స్విమ్మింగ్‌లో విజేతలకు ఈనెల 23న నిర్వహించే ఒలంపిక్ డే కార్యక్రమంలో పతకాలు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి. రామకృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులు రమేష్, కోశాధికారి దస్తగిరి, శివప్రసాద్, రామకృష్ణ, ఈత శిక్షకులు నటరాజరావు పాల్గొన్నారు.